క్లుప్తంగా

రాష్ట్ర డిజాస్టర్, ఫైర్ డీజీ సునీల్‌కుమార్ రాక



పోలీసు వందనం స్వీకరిస్తున్న సునీల్‌కుమార్. చిత్రంలో ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా

అమలాపురం టౌన్: రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైర్ సర్వీసెస్ డీజీ పి.సునీల్ కుమార్ అమాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు అమలాపురం వచ్చిన ఈయనకు ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. తొలుత ఎస్పీ కార్యాలయం ఆవరణలో డీజీ సునీల్ కుమార్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కొద్దిసేపు ఆయన ఎస్పీ, ఏఎస్పీలతో మాట్లాడి అక్కడ నుంచి ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు యానాం విద్యార్థులు



నేషనల్‌స్కూమ్స్‌కు వెళ్లిన యానాం విద్యార్థులు

యానాం: విజయవాడలో జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో అండర్19 బాడ్మింటన్ టోర్నీలో పాల్గొనేందుకు మంగళవారం యానాం నుంచి బాలుర బృందం వెళ్లింది. ఈ నెల 16వరకు నిర్వహించనున్న ఈ టోర్నీలో భయ్యాల కిరణ్, మణికంఠ, ముఖేష్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికలు పుదుచ్చేరి నుంచి పాల్గొంటున్నారు. ఈ క్రీడాబృందానికి స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ పీఈటీ ఇండుగుల వెంకటకృష్ణమోహన్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌కు ప్రశంసా పత్రం



ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఖాదర్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మసీదులకు వెళ్లి విస్తృత ప్రచారం చేసిన జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్‌ను అభినందిస్తూ ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విజయవాడలో మంగళవారం ప్రశంసా పత్రాన్ని అందించారు. హల్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మసీదుల్లో నిర్వహించిందని ఖాదర్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ సంతకం చేసిన ప్రశంసా పత్రాన్ని అందుకున్నందుకు ఆనందంగా ఉందని ఖాదర్ తెలిపారు. తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాదర్ బాషా సమక్షంలో రామకృష్ణారెడ్డి ఈ ప్రశంసా పత్రాన్ని అందించారని ఖాదర్ తెలిపారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



అమలాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

అమలాపురం టౌన్: కేంద్ర రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు అమలాపురం డివిజన్‌లోని గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. ఆ ఉద్యోగుల పీజేసీఏ చైర్‌పర్సన్ వీవీ మహాలక్ష్మి అధ్యక్షతన స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. సమ్మె శిబిరం వద్ద మహాలక్ష్మి మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న దాదాపు 400 మంది గ్రామీణ తపాలా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మెకు దిగినట్లు చెప్పారు. తమకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐజీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు వీవీ రామకృష్ణ, ఎన్‌యూడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణ, అమలాపురం పీజేసీఏ కన్వీనర్ జీఎన్ రాయల్, డివిజనల్ అధ్యక్ష కార్యదర్శులు భీమా అర్జునరావు, రాయుడు మహేష్‌బాబు, ఎఫ్ఎన్‌పీవో సెక్రటరీ ఏకాంబరం నిరసన వ్యక్తం చేశారు.

యానాం: కేంద్ర, రాష్ట్రాల గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘాల పిలుపు మేరకు మంగళవారం యానాం సబ్‌పోస్టాఫీసు పరిధిలో గల 12 బ్రాంచ్‌పోస్టు ఆఫీసుల సిబ్బంది విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగారు. కాకినాడ డివిజన్ సహాయ కార్యదర్శి ఎం.బుల్లియ్య మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష పూరిత ధోరణిని అనుసరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటలకు వేళాయె

- 15 నుంచి సచివాలయ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర కీడలు
- ముగిసిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ



సచివాలయ సిబ్బందికి ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ (ఫైల్)

అల్లవరం: గ్రామీణ ప్రాంతాల్లో సత్తా ఉన్న క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్రను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఆదరణ కరువై, ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునే అవకాశాలను కోల్పోతున్నారు. ప్రోత్సాహం లేని క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ప్రోగ్రామ్‌ను నిర్వహించనుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టిన బిడ్డ నుంచి వృద్ధాప్యంలో ఉన్న వారితో సహా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల అమలుచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాతగా నిలిచారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభను వెలికితీసి ఈ దేశానికి కీర్తి ప్రతిష్టలు పెంచే దిశగా ఆడుదాం ఆంధ్ర క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. 15 సంవత్సరాల వయస్సు పైబడి క్రీడల పట్ల ఉత్సాహవంతులైన స్త్రీ, పురుషులకు గ్రామ సచివాలయ స్థాయిలో ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి క్రీడాకారులు గ్రామ సచివాలయం స్థాయిలో వలంటీర్ల నమోదు ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. నాకౌట్ పద్ధతిలోజరగనున్న ఈ క్రీడలకు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఆటల పోటీలను నిర్వహిస్తారు. గ్రామ స్థాయిలో విజేతలను మండల స్థాయిలో ఆడించనున్నారు. మండల స్థాయిలో విజేతలను జిల్లా స్థాయిలోను, జిల్లా స్థాయిలోని విజేతలను రాష్ట్ర స్థాయిలో ఆడించనున్నారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు పోటీలు నిర్వహించనున్నారు. క్రీడా సామగ్రిని గ్రామ సచివాలయ స్థాయిలో అందించారు.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో తొలి స్థానం నిలిచిన జట్టుకు రూ.35 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.5 లక్షలు ప్రైజ్ మనీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బ్యాడ్మింటన్‌లో నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.35 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.2 లక్షలుగా నిర్ధారించారు. బ్యాడ్మింటన్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు పురస్కారాలను అందించనున్నారు.

మండలం	సచివాలయాలు	టార్గెట్	రిజిస్ట్రేషన్
అల్లవరం	23	5,244	7,243
అమలాపురం	44	10,032	3,170
ఉప్పలగుప్తం	17	3,876	1,841

అవగాహన కల్పించాం



ఆడుదాం ఆంధ్ర క్రీడలను సమర్థంగా నిర్వహించడానికి కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతి గ్రామం నుంచి స్త్రీ, పురుషులను ఎంపిక చేశాం. ఈ నెల 15 నుంచి సచివాలయ స్థాయిలో ఘనంగా నిర్వహించనున్నాం.

– టీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, అల్లవరం

పీడీల పర్యవేక్షణలో..



సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఫిజికల్ డైరెక్టర్ల పర్యవేక్షణలో పీఈటీలు, స్పోర్ట్స్ వలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తాం. నియమ నిబంధనల మేరకు క్రీడాకారులు ఆడేలా చూడవలసిన బాధ్యత పీడీలు, పీఈటీలపై ఉంది.

– ఉండ్రు సత్య వెంకట ముసలయ్య, పీడీ, కోడూరుపాడు

వివరాలు ఇలా..

అమలాపురం నియోజకవర్గం పరిధిలోని 94 సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో ఆడేందుకు 12,254 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

స్టేట్ లెవిల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో బహుమతి



హోంమంత్రి నుంచి బహుమతి అందుకుంటున్న నరసింహమూర్తి

యానాం: పుదుచ్చేరిలో ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహించిన స్టేట్‌లెవిల్ సైన్స్ ఎగ్జిబిషన్–2023లో స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పెమ్మాడి నరసింహమూర్తి హయ్యర్ సెకండరీ లెవిల్‌లో కన్సొలేషన్ బహుమతి పొందినట్లు గైడ్ టీచర్ పాలికి ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రంగసామి పాల్గొనగా బహుమతులను హోంమంత్రి నమశ్శివాయం అందజేశారని పేర్కొన్నారు.

ప్రజాఉత్సవాలపై సమావేశం

యానాం: యానాంలో ప్రజాఉత్సవాల నిర్వహణ, ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేయడానికి విధి, విధానాలు రూపొందించడానికి మంగళవారం స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ భవనం నిర్మించాలి



వినతి పత్రం అందిస్తున్న దోలమణి రుద్ర దంపతులు

అమలాపురం రూరల్: అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన భవనం నిర్మించాలని చైర్ పర్సన్ దంగేటి డోలమణి రుద్ర దంపతులు మార్కెట్ కమిటీ కమిషనర్ రాహుల్ పాండేను కోరారు. మంగళవారం గుంటూరులో కమిషనర్ రాహుల్ పాండేని ఆయన కార్యాలయంలో కలిసి అమలాపురం మార్కెట్ కమిటీ బిల్డింగ్ నిర్మాణంపై చర్చించారు. ఇప్పటికే అమలాపురం రైతుబజార్‌లో స్థలాన్ని అధికారులు గుర్తించి ప్రతిపాదనలు పంపించారని, నిధులు మంజూరు చేసి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతి ప్రతం అందించారు. ఉప్పలగుప్తంలో ఆగిపోయిన మార్కెట్ కమిటీ గోడౌన్ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర సరకుల అందజేత

అమలాపురం రూరల్: అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన పురంశెట్టి రాము దంపతులు నల్లమిల్లి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల రాముకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అతని కుటుంబ పరిస్థితి దుర్భరంగా మారింది. చిందాడగరువు చెందిన సామాజిక కార్యకర్త, ఎంపీటీసీ మోటూరి కనకదుర్గా వెంకటేశ్వరరావు దంపతులు స్పందించి రూ. 5వేలు విలువైన ఒక నెల సరిపడ నిత్యావసర సరకులు అందజేశారు.

స్పీడ్ బోటులతో పందెం

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్పలో యువత స్పీడ్‌బోటుల పందేలకు శ్రీకారం చుట్టింది. గ్రామంలో ఏటా దీపావళి అనంతరం వల కట్లు స్థలం కోసం పోటీలు నిర్వహిస్తుంది. చేపలు అధిక మొత్తంలో దొరికే స్థలం చేజిక్కించు కునేందుకు సుమారు రూ.2 లక్షల విలువైన స్పీడ్‌బోటులను సిద్ధం చేసుకుంటారు. పోటీలు నిర్వహించేందుకు ఇంకా సమయం పెద్దలు నిర్ణయించలేదు. మంగళవారం యువత ఒక అడుగు ముందుకు వేసి రెండు బోటుల మధ్య ఇద్దరు యువకులు రూ.50 వేల చొప్పున పందెంతో పోటీ పడ్డారు. పోటీలో ఉన్న రెండు బోటులపై అనేక మంది యువకులు వేలాది రూపాయలు బెట్టింగ్ కాశారు.

ఇన్ని సంక్షేమ పథకాల అమలు ఓ రికార్డు

- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు



తిళ్లకుప్పలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ కన్వీనర్, ఇతర నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న అల్లవరం ఎంపీపీ శేషగిరిరావు



తాళ్లరేవులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

అమలాపురం టౌన్: జగన్ ప్రభుత్వంలో పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలు అమలు కావడం ఓ రికార్డు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వంలోనూ ఇన్ని సంక్షేమ పథకాలు అమలతున్న దాఖలాలు లేవని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక సూర్యనగర్‌లోని 15, 16 వార్డు సచివాలయం వద్ద మంగళవారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత ఆ రెండు వార్డులకు సంబంధించి ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఎమ్మెల్సీ ప్రారంభించారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి ప్రసంగించారు. పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, ఉండ్రు బాబ్జీ, వాసర్ల సుబ్బారావు ప్రజలకు జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ ఫలాల గణంకాలు వివరించారు. వార్డు సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలందరూ ముక్త కంఠంతో కోరుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు అన్నారు. తిళ్లకుప్ప సర్పంచ్ కడియం తమ్మయ్య అధ్యక్షతన మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ఎంపీపీ మెర్ల రాణిమిరియం జ్యోతి మాట్లాడుతూ 33 సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా లబ్ధిని జమ చేశారన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి రూ.25 కోట్లు నిధులు తిళ్లకుప్ప గ్రామానికి ఖర్చు చేశారని వివరించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రేవు సత్యనారాయణ, శీలం రమణ, ఏలూరి ఆదినారాయణ, ఉండ్రు వెంకటేశ్వరావు, మీసాల అంజి, ఉండ్రు సత్యనారాయణ, ఎంఎస్ఎన్ రాజు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎదుర్లంక సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు అధ్యక్షతన జరిగింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలువెత్తు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. సుమారు రూ.18కోట్లు గ్రామానికి ఖర్చు చేశామన్నారు. ఢిల్లీ నారాయణ, మెర్ల రాఘవులు, సురేంద్రరాజు, దండు వీరభద్రరాజు, వెంకటేశ్వరాజు, దుక్కిపాటి శశికళ, చెల్లి రమేష్ పాల్గొన్నారు.

అల్లవరం: బోడసకుర్రు సచివాలయం–1 పరిధిలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించి సంక్షేమ ప్రదాతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రపుటల్లో కెక్కారని తెలిపారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ బోర్డుని ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దొమ్మేటి శ్రీశాంతిభవాని, గుబ్బల బాబ్జి, పులుసుగంటి రాజేశ్వరీ, మాజీ సర్పంచులు దొమ్మేటి శ్యాంప్రకాష్, సాపే ధర్మరాజు, గ్రామకమిటీ అధ్యక్షులు మట్టపర్తి షణ్ముఖరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. మంగళవారం తాళ్లరేవు సచివాలయం–1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన లబ్ధిని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేరూరు గ్రామంలో సచివాలయం–4 కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ దాసరి అరుణ అధ్యక్షతన జరిగింది. సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా 1,365 కుటుంబాలకు మొత్తం రూ.26,23,24,001 అందించారు. ఆమె మాట్లాడుతూ సంతృప్తి కరమైన పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఉప సర్పంచ్ కూడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బురామ్, దొంగ ఆంజనేయులు, వాసంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్‌ని మరోమారు సీఎంగా చూడడమే లక్ష్యం

ఉప్పలగుప్తం: స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే తనకు ఎంతో అభిమానమని, ఆయన మరణాంతరం ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్రలో ఆయన వెంట ఉన్నానని వైఎస్సార్ సీపీ నాయకులు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు అన్నారు. చల్లపల్లిలోని జగ్గరాజుపేటలోని ఆయన నివాసం వద్ద గుడ్ సీడ్ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి సీఎం జగన్ వెంటే ఉంటూ పార్టీ విజయానికి కృషి చేశానని తెలిపారు. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ వై నాట్ 175 నినాదంతో ముందుకు వెళ్తున్నారని, మళ్లీ ఆయనే ఏపీకి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న దివ్యాంగులకు ట్రై సైకిల్స్, మహిళలకు కుట్టుమెషీన్లు అందించనున్నామని తెలిపారు. సామాజిక వేత్త పచ్చిమాల బాబ్జి, పులిదిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

పంట కాలువ పనుల పరిశీలన



కొమరగిరి, మురమళ్ల పంటకాలువ పనులు పరిశీలిస్తున్న నాగిరెడ్డి, రైతులు

ఐ.పోలవరం: రైతులకు అండగా ఉంటామని చెప్పడం కాకుండా చేతల్లో చూపిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ వైఎస్ కమిషనర్ ఎంఎస్ నాగిరెడ్డి అన్నారు. మురమళ్ల – గుత్తినదీవి ప్రధాన పంట కాలువలో మట్టి పనులు, పూడికతీత పనులను ఆయన రైతులతో కలసి పరిశీలించారు. మురమళ్ల, కొమరగిరి, ఎదుర్లంక పంటకాలువ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, తుపాను కారణంగా సుమారు 3,800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆయనకు చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 12వేల ఎకరాల మేర నష్టం వాటిల్లిందని న్నారు. రైతులను అన్నివిధాలా ఈ భుత్వం ఆదుకొంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దశాబ్దాల పాటు పెండింగ్‌లో ఉన్న నార్త్ అడ్డాలు కాలువ పనులు ఈ ప్రభుత్వంలో పూర్తి చేశామని గుర్తు చేశారు. శివారు భూమి వరకూ సాగు నీరు అందేలా చర్యలు తీసుకొంటామన్నారు. రైతులు ముదునూరి సతీష్‌రాజు, ఢిల్లీ నారాయణ, పిన్నంరాజు వెంకటపతిరాజు, సాగిరాజు వాసురాజు, కళింగ మూర్తి, సర్పంచ్ కాశే రాజుబాబు, నాగిరెడ్డికి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

తాళ్లరేవు: చొల్లంగిపేటలో మంగళవారం 10వ కార్తిక వన సమారాధన నిర్వహించారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పితాని బాలకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సంఘీయులు ఐకమత్యంతో ఉంటూ రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కనకలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన

కాట్రేనికోన: స్థానిక కనకలింగేశ్వర స్వామికి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరుని పూజ, మహాన్యాసం, ఏకాదశ వార రుద్రాభిషేకాలు, మహాలింగార్చన, సూర్య నమస్కారాలు, సుందరకాండ పారాయణ, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు వితరణ జరిగింది.

అంగన్‌వాడీల నిరసన

తాళ్లరేవు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర యూనియన్ సమ్మె పిలుపులో భాగంగా స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు.

కన్నుల పండువగా వీరేశ్వరుని దీపోత్సవం



దీపోత్సవం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



వీరేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం చివరిరోజు మంగళవారం కన్నుల పండువగా దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భారీ సెట్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పరమశివుడు, వినాయకుడు, లక్ష్మీనరశింహస్వామి,ఓం కారం, అయ్యప్ప, సుబ్రహమణ్యేశ్వరుడు ఆకృతులు వివిధ రకాలతో, పుష్పాలతో దీపాలంకరణ ఆకట్టుకొంది. ముఖ్యఅతిథిగా టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హాజరయ్యారు. తొలుత స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బేడా మంటపంలో, గర్భాలయంలో దీపాలు ఏర్పాటు చేశారు. ఈ దీపాలు వెలిగించేందుకు అధిక సంఖ్యలో భక్తులు మండలం నలుమూలల నుంచి తరలి వచ్చారు. అర్చకస్వామి యనమండ్ర సత్య సీతారామశర్మ, ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు దంపతులచే గణపతి పూజ, లక్ష్మి పూజ, ఇతర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అక్రమ మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్ట్

అమలాపురం టౌన్: అక్రమ మద్యం కలిగి ఉండడమే కాకుండా అమ్ముతున్నారన్న నేరారోపణపై అంబాజీపేట మండలం మాచవరం, నందంపూడి గ్రామాలకు చెందిన ఇద్దరిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు అమలాపురం ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా పర్యవేక్షణలో ఈ దాడులు చేశామన్నారు. మాచవరానికి చెందిన ముత్తాని సత్యనారాయణ యానాం మద్యం బాటిల్స్‌ను తెచ్చి డ్రింక్ బాటిల్స్‌లో పోసి అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల మద్యం, 25 బీరు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నందంపూడికి చెందిన మద్దింశెట్టి రాంబాబు అనే సిద్ధూను పది ఆంధ్ర మద్యం సీసాలను అమ్ముతున్నప్పుడు పట్టుకున్నారు. ఈ రెండు కేసుల్లో ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు విధించినట్లు సీఐ శివరామరాజు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై సీహెచ్ స్వామి రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ నూతన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

తాళ్లరేవు: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తుపాను కారణంగా వరిపంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ రైతులెవరూ అధైర్యపడవద్దని జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ వరిపంటలో 33 శాతం కంటే ఎక్కువ నష్టం కలిగితే ఆ పంట నమోదు చేస్తామన్నారు. ఈ మేరకు ఐదుగురు సభ్యులతో కలిసి గ్రామ, మండల స్థాయి కమిటీలు వేసినట్లు తెలిపారు. పంట నష్టం అంచనావేసి ఈ నెల 18వ తేదీలోగా అందజేయాలని, 19వ తేదీన సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, సర్పంచ్‌లు శాఖా శంకరుడు, ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ సభ్యులు

అమలాపురం రూరల్: వన్నె చింతలపూడి గరువు లయన్స్ క్లబ్ సభ్యుడు రాంబాబు మామిడితోటలో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316 రీజియన్ –1, జోన్ –1 చైర్‌పర్సన్ జంపన సుమన్‌వర్మ ఆధ్వర్యంలో సమన్విత జోన్ సోషల్ కార్యక్రమం జరిగింది. క్లబ్ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని ఉత్సాహంగా ఆటపాటలతో గడిపారు. ముఖ్య అతిథులుగా అనిల్‌కుమార్ జైన్, డాక్టర్ పీఎస్ శర్మ, క్లబ్ సభ్యులను సుమన్ వర్మ సత్కరించారు. సేవా కార్యక్రమాలు చేసిన క్లబ్‌లకు జోన్ సోషల్ అవార్డు అందించారు. మొక్కలు నాటారు.